# సిపిఐ(ఎం-ఎల్) అఖిలభారత మహాసభ తీర్మానాలు

**సంతాప తీర్మానం :**

భారతదేశంలో సామ్రాజ్యవాదులు, భూస్వాములు, దళారీ పెట్టుబడిదారులు వారి తాబేదారులు నేడు సమాజంలో నెలకొని ఉన్న సంక్షోభాన్ని మరుగునపరిచి, కుళ్ళికంపు కొడుతున్న ఈ వ్యవస్థను రక్షించటానికి పూనుకొన్నారు. భారత పాలకవర్గాలు ప్రజలను మభ్య పెట్టే, భ్రమలలో ముంచే అణచివేసే విధానాలు అవలంబించటం, విప్లవకారులపై, ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులపై నిర్బంధాన్ని నిరంతరాయంగా ప్రయోగించటం దీనిలో ఒక భాగం మాత్రమే. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనావిధానం వెలుగులో నూతన ప్రజాతంత్ర వ్యవస్థను సాధించటానికి అంకితభావంతో కృషిచేస్తున్న కమ్యూనిస్టు విప్లవకారులు కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని, ఆదివాసీలను, మహిళలను, మధ్యతరగతి వర్గాన్ని, దళితులను ఇంకా ఇతర ప్రజాసమూహాలను సంఘటితం కావించటంలో, వారికి నాయకత్వం వహించటంలో అనేక విధాల సంఘర్షణ పడుతూ ఉన్నారు. ఇతర ప్రగతిశీల ప్రజాతంత్ర శక్తులు కూడా ప్రస్తుత సమాజంలోని దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే కృషిలో ఉన్నాయి. ఈ విధంగా మనదేశంలో ప్రస్తుత వ్యవస్థకు వ్యతిరేకంగా వివిధ పద్ధతుల్లో, వివిధ స్థాయిల్లో పోరాటాలు సాగుతూ ఉన్నాయి.

విప్లవోద్యమాన్ని, పార్టీని నిర్మించే క్రమంలో అంకితభావంతో పనిచేస్తూ ఉన్న అనేకమంది మన పార్టీలోని సీనియర్ కామ్రేడ్లు గడచిన ఈ దశాబ్ద కాలంలో అమరులయ్యారు. అదేవిధంగా ఇతర విప్లవ కమ్యూనిస్టు సంస్థలకు చెందినవారు కూడా అనేకమంది అమరులయ్యారు.

కొందరు హేతువాదులు, ప్రగతిశీల మేధావులు తమ తమ రంగాలలో అంకితభావంతో పనిచేస్తున్నవారు హిందూ మత ఛాందసవాదులు చేసిన క్రూరమైన దాడులలో మరణించారు. అలాగే అనేకమంది దళితులు, ముస్లింలు, మహిళలు హిందూ మతోన్మాద, పురుషాధిపత్యపు దాడులకు బలయ్యారు.

అనేకమంది ప్రగతిశీల ప్రజాతంత్ర మేధావులు, తమ జీవిత పర్యంతం ప్రగతిశీల ప్రజాతంత్ర భావాలు, ఉద్యమాలు విస్తరించటానికి కృషిచేసి వార్ధక్యంతోను, అనారోగ్యాలకు గురై మరణించారు.

అనేకమంది కార్మికులు, ఆదివాసీలు, ఇతర కష్టజీవులైన పేదలు దుర్భర దారిద్ర్యంతో, వైద్యసహాయం అందక, పనిప్రదేశాలలో జరిగిన ప్రమాదాలలోను మరణించారు. మరికొందరు బహుళజాతి కంపెనీల, దేశీయ కార్పొరేట్ వర్గాల నుండి తమ వనరులను, జీవనోపాధిని, భూములను, నివాసాలను కాపాడుకునే క్రమంలో మరణించారు.

తమ జాతీయ ఆకాంక్షల కొరకు, ప్రజాతంత్ర హక్కుల కొరకు పోరాడే క్రమంలో జరిగిన కాల్పులలో కాశ్మీర్ వంటి ప్రదేశాలలో అనేకమంది అశువులుబాశారు.

భారత పాలకవర్గాల దుర్మార్గపు వ్యవసాయ విధానం ఫలితంగా రుణరక్కసి కోరల్లో చిక్కుకుని లక్షలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

తుఫానులు, వరదలు, ఇంకా ఇతర విపత్తుల ఫలితంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. మరణించిన మన పార్టీ నాయకులకు, అమరులకు మనం విప్లవ జోహార్లు తెలియజేస్తున్నాం. మతతత్వ, అభివృద్ధి నిరోధకశక్తుల దాడులలో చనిపోయిన వారికి, ఉన్నతమైన సమాజంకొరకు, ఉన్నతమైన జీవితంకొరకు, ఉన్నతమైన భావాల వ్యాప్తి కొరకు పోరాడే క్రమంలో అమరులైన అందరికీ జోహార్లు అర్పిస్తున్నాం. వారి స్ఫూర్తితో, మరింత సంసిద్ధతతో, అంకితభావంతో ప్రస్తుతమున్న దోపిడీ వ్యవస్థను అంతంచేసి నూతన ప్రజాతంత్రవ్యవస్థను నిర్మించటానికి కంకణబద్ధుల మవుదాం.

| | | |
|---|---|---|
| కా॥ కానూసన్యాల్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) ప్రధాన కార్యదర్శి | 23-3-2010 |
| కా॥ ఉమాశంకర్‌సింగ్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు | .....-2-2014 |
| కా॥ సురేంద్రసింగ్ కథియార్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు | 18-4-2014 |
| కా॥ షబ్బర్ హుస్సేన్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు | 15-11-2014 |
| కా॥ అసిత్‌సిన్హా | సి.పి.ఐ.(ఎం-ఎల్) కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటి సభ్యులు | 31-1-2015 |
| కా॥ రబిన్‌గుహ | సి.పి.ఐ.(ఎం-ఎల్) డబ్ల్యుబి-ఎస్‌సిఎం | 16-1-2010 |
| కా॥ కెంద్రుక అర్జున్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) ఒడిషా పి.ఎమ్ | 9-8-2011 |
| కా॥ షేక్ బహార్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) డబ్ల్యుబి-ఎస్‌సిఎం | 10-5-2010 |
| కా॥ అజిత్ దాస్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) డబ్ల్యుబి-ఎస్‌సిఎం | 19-10-2010 |

| | | |
|---|---|---|
| కా॥ పి.వి. సుబ్బారావు | సి.పి.ఐ.(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ | 5-1-2012 |
| కా॥ బచన్ లాల్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) ఉత్తరప్రదేశ్ | ....-8-2012 |
| కా॥ జి. సీతారామయ్య | సి.పి.ఐ.(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ | 24-9-2012 |
| కా॥ మానం రామారావు | సి.పి.ఐ.(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ | 3-3-2013 |
| కా॥ సుశీలాదేవి | సి.పి.ఐ.(ఎం-ఎల్), రాజస్థాన్ | |
| కా॥ వి.హెచ్. మాస్టర్ | సి.పి.ఐ.(ఎం-ఎల్), కర్ణాటక | 15-6-2013 |
| కా॥ ఛాయరాజ్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ | 20-9-2013 |
| కా॥ కిషోరిలాల్ | సి.పి.ఐ.(ఎం-ఎల్) ఉత్తరప్రదేశ్ | 16-2-2014 |
| కా॥ సి.ఆర్. కరోలి | సి.పి.ఐ.(ఎం-ఎల్), కేరళ | 11-2-2014 |
| కా॥ వి. సుబ్బారావు | సి.పి.ఐ.(ఎం-ఎల్), ఆంధ్రప్రదేశ్ | 7-12-2014 |
| కా॥ మందాజార్జి | సి.పి.ఐ.(ఎం-ఎల్), ఆంధ్రప్రదేశ్ | 19-3-2016 |
| కా॥ ఆర్.బి. ఖతివర | సి.పి.ఐ.(ఎం-ఎల్), డబ్ల్యు.బి. - ఎస్‌సిఎం | 4-7-2016 |
| కా॥ చంద్రేశ్వర్ ఠాకూర్ | సి.పి.ఐ.(ఎం-ఎల్), బీహార్ - ఎస్‌సిఎం | |
| కా॥ భాస్కర్ | సి.పి.ఐ.(ఎం-ఎల్), తమిళనాడు | |
| కా॥ బలన్ | తమిళనాడు | |
| కా॥ బి.ఎం. పట్నాయక్ | ఒడిషా | 12-12-2009 |
| కా॥ అరయక్కండి అచ్యుతన్ | కేరళ | 10-2-2009 |
| కా॥ మోని గుహ | పశ్చిమబెంగాల్ | 7-4-2009 |
| కా॥ జితిన్‌దాస్ గుప్త | పశ్చిమబెంగాల్ | -3-2010 |
| కా॥ పైలా వాసుదేవరావు | ఆంధ్రప్రదేశ్ | 12-4-2010 |
| కా॥ బుర్రా రాములు | ఆంధ్రప్రదేశ్ | 14-5-2011 |
| కా॥ ఎం.హెచ్. కృష్ణప్ప | కర్ణాటక | 17-5-2011 |
| కా॥ మాదాల నారాయణస్వామి | ఆంధ్రప్రదేశ్ | 9-12-2013 |
| కా॥ రాయల ఎస్.సి. బోస్ | ఆంధ్రప్రదేశ్ | 9-3-2016 |
| శ్రీ సీతారామశాస్త్రి | జార్ఖండ్ | 24-9-2012 |
| జస్టిస్ చిన్నపరెడ్డి | ఆంధ్రప్రదేశ్ | 13-4-2013 |
| డా॥ అస్గర్‌అలీ ఇంజనీర్ | ముంబయి | 14-3-2013 |
| కా॥ నరేంద్ర దభోల్కర్ | మహారాష్ట్ర | 20-8-2013 |
| సి. పద్మనాభరెడ్డి | ఆంధ్రప్రదేశ్ | 4-8-2013 |
| అగస్టో బోల్ ఛావెజ్ | వెనిజులా | 8-3-2013 |
| నెల్సన్ మండేలా | దక్షిణాఫ్రికా | 5-12-2013 |
| గోవింద పన్సారే | మహారాష్ట్ర | 20-2-2015 |
| ఎం.ఎం. కల్బుర్గి | కర్ణాటక | 30-8-2015 |
| మహాశ్వేతాదేవి | పశ్చిమబెంగాల్ | 28-7-2016 |
| రోహిత్ వేముల | హైదరాబాద్ | 17-1-2016 |
| ప్రొఫెసర్. రణధీర్‌సింగ్ | | 31-1-2016 |
| దాశరధి రంగాచార్య | | 8-6-2015 |
| అద్దేపల్లి రామమోహనరావు | | 13-1-2016 |
| డా॥ బి.డి.శర్మ | | 6-12-2015 |
| డా॥ బి.పి. కేసరి | | 16-8-2016 |

**దళితులపై, మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా :**

దళితులపై, మైనారిటీ మతస్తులపై దాడులు రోజురోజుకు పెరగటమేకాక క్రూరమైన రూపాలను సంతరించుకొంటున్నాయి. అవమానాలు, వివక్షతలు, వెలివేతలు, తమ తమ భూముల నుండి ఇళ్ళ నుండి గెంటివేతలు, దారుణ హత్యలు లేకుండా రోజు గడవటంలేదు. భూస్వాముల పొలాలలో పనిచేసే వ్యవసాయ కూలీలు, నగరాల్లో నీచంగా చూడబడే పనులు చేసేవాళ్ళు, విద్యాధికవర్గాల, ధనిక, అగ్రకుల శక్తుల దాడులకు గురవుతున్నారు. గడచిన రెండు సంవత్సరాల బిజెపి పాలనలో ఈ దాడులు మరింతగా పెరిగాయి. వాటి సంఖ్యలోను, తీవ్రతలోను, దుర్మార్గపు స్వభావంలోను, బిజెపి, సంఘపరివార్ శక్తులు తమ ఫ్యూడల్, అగ్రకుల తత్వంతో హిందుత్వ, జాతీయత భావాలను వ్యాప్తి చేయటానికి గోరక్షకులనే పేరుతో లంపెన్ శక్తులు దళితులపై, మైనారిటీ మతస్తులపై నేరాలకు పాల్పడేందుకు ప్రేరేపిస్తున్నాయి. ఆవు మాంసం తిన్నారని, అమ్మారని, ఆవును చంపారని రకరకాల వదంతులు వ్యాప్తి

చేయటం, కథలు అల్లటం, టెర్రరిజం బూచిని చూపటం వంటి వాటితో దళితులపై, మైనారిటీ మతస్తులపై దాడులు చేయటానికి, చంపటానికి వెనకాడటం లేదు. ముజఫర్‌పూర్ ఊచకోత, 2016 జులైలో కర్ణాటకలోని శాంతిపురాలో దళితులపై దాడులు, హైదరాబాదులో రోహిత్ వేముల ఆత్మహత్య, 2015 సెప్టెంబరు ఉత్తరప్రదేశ్‌లోని దాద్రిలో మహమ్మద్ అక్లాఖ్‌ను హత్యగావించటం, 2016 జులై 11న గుజరాత్‌లోని వునా పట్టణంలో నలుగురు దళిత యువకులను కొరడాలతో కొడుతూ నడివీధుల్లో నగ్నంగా ఊరేగించటం ఇవన్నీ అనేక ఘటనల్లో మచ్చుకు కొన్ని మాత్రమే. ఈ దాడులు దేశవ్యాప్తంగా జరుగుతున్నప్పటికీ గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్, హర్యానా, ఆంధ్రప్రదేశ్‌లు ఈ దాడులు సాగించటంలో అగ్రగామిగా నిలుస్తున్నాయి.

పత్రికల్లో వచ్చిన సమాచారం ప్రకారం గుజరాత్‌లో దరిదాపు 200 వరకు గోరక్షణ సంస్థలు పుట్టుకొచ్చాయి. వాళ్ళ చర్యల ద్వారా, ప్రచారం ద్వారా దళితులలో, మైనారిటీలలో భయోత్పాతాలను సృష్టించి, భూస్వాములకు, ధనికులకు, హిందుత్వ శక్తులకు లొంగి ఉంటేనే బ్రతుకు అనేవిధంగా వారిని మలిచే ప్రయత్నం చేస్తున్నారు. తమ హక్కుల కోసం, న్యాయమైన డిమాండ్ల కోసం కార్మికులు, ఇతర పేద ప్రజలు సాగిస్తున్న పోరాటాలను కూడా వీరు లక్ష్యంగా చేసుకొని ఆ పోరాటాలు ఆపకపోతే దాడులు తప్పవనే హెచ్చరికలు చేస్తున్నారు. ఏదో ఒక పాలకవర్గ పార్టీకి అనుకూలించే విధంగా ప్రజలను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలించటానికి కూడా ఈ దాడులను ఉపయోగించుకొంటున్నారు.

దళితులు, మైనారిటీ వర్గాలలో వీటికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన పెరుగుతూ ఉంది. పాలకవర్గాల వేర్పాటువాద, ప్రక్కదోవ పట్టించే రాజకీయాలను ఈ దాడుల ద్వారా ప్రజలు స్పష్టంగా చూడగల్గుతున్నారు. ఉపాధిని, హుందాగా జీవించటాన్ని సాధ్యం చేయగల రాజకీయ పరిస్థితుల కోసం, భూమికోసం ఆకాంక్షలు బలం పుంజుకుంటున్నాయి. ఈ ఆకాంక్షలకు మద్దతు కూడా పెరుగుతోంది. దళితులు, మైనారిటీలు అసమానత, వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటాలకు సి.పి.ఐ(ఎం-ఎల్) అఖిలభారత మహాసభ తన సంపూర్ణ మద్దతును, సంఘీభావాన్ని తెలియజేస్తోంది. కార్మికులను, రైతాంగాన్ని, మహిళలను, దళితులను, మైనారిటీలను ఇంకా ఇతర పీడిత, తాడిత ప్రజలను ఏకంచేసి, అన్ని దురాగతాలకు కారణమైన ప్రస్తుత వ్యవస్థను కూలద్రోసి నూతన ప్రజాతంత్ర వ్యవస్థ సాధనకు కృషి సాగిస్తామని ఈ మహాసభ ప్రతిజ్ఞ చేస్తోంది.

**కాశ్మీర్‌లో నిర్భంధంపై :**

కాశ్మీర్ నేడు భగ్గుమంటోంది. భారత భద్రతా దళాలు 2016 జులై 9న బుర్హాన్‌వానీని అత్యంత కిరాతకంగా చంపిన నాటినుండి ప్రజలలో వ్యతిరేకత తీవ్రమైంది. నేటికి రెండు నెలలు (మహాసభ నాటికి) గడిచాయి. అయినా కాశ్మీర్ ప్రజల కోపాగ్ని చల్లబడలేదు. ఈ కాలంలో భద్రతాదళాల చేతుల్లో 70 మందికి పైగా చనిపోగా, వేలాదిమంది తీవ్ర గాయాలపాలయ్యారు. పెల్లెట్లు తగిలి అనేకమంది పూర్తిగానో, పాక్షికంగానో చూపును కోల్పోయారు. భారత రాజ్యం, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని భద్రతాదళాలు - నిరసన వ్యక్తం చేస్తున్న కాశ్మీర్ ప్రజలను శత్రువులుగా చూస్తున్నాయి. ఇదొక విచారకరమైన పరిస్థితి.

కాశ్మీర్‌లో భద్రతాదళాలు సాగిస్తున్న దుర్మార్గపు నిర్బంధాన్ని ఖండించటం ప్రతి ప్రజాస్వామిక పౌరుని బాధ్యత. ప్రస్తుత నిరసన కాశ్మీర్ సమస్యను మరోసారి బలంగా ముందుకు తీసుకొచ్చి నిలబెట్టింది. భారత పాలకులు వివిధ సంక్షోభాలను దాటడం కోసం ప్రజలను మభ్యపెట్టటానికి, పక్కదారి పట్టించటానికి, విభజించటానికి, అణచి ఉంచటానికి అనుసరిస్తున్న విధానాలన్నీ కాశ్మీర్ సమస్యను పరిష్కరించటంలో విఫలమయ్యాయని మాటిమాటికీ తలెత్తుతున్న ప్రజా నిరసనలు స్పష్టం చేస్తున్నాయి. కాశ్మీర్ సమస్యకున్న మూలకారణాన్ని గుర్తించి, న్యాయమైన శాశ్వతమైన పరిష్కారాన్ని కనుగొనాల్సిన అవసరం ఉన్నది.

సి.పి.ఐ.(ఎం-ఎల్) అఖిలభారత మహాసభ కాశ్మీర్ ప్రజల న్యాయమైన ఆకాంక్షలకు తన హృదయ పూర్వక మద్దతు తెలియచేస్తోంది. భారత, పాకిస్తాన్ రెండు ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించటానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, రెండు ప్రభుత్వాలూ ఇరువైపులా మోహరించిన భద్రతా దళాలను ఉపసంహ రించాలని, కాశ్మీర్ ప్రజలు తమ ఆకాంక్షలను నిర్భయంగా, స్వేచ్ఛగా వ్యక్తం చేయగలిగే, తమ రాజకీయ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే విధంగా అనుకూలమైన, ప్రజాస్వామిక వాతావరణం ఉండేట్లుగా ఇరుదేశాలూ చర్యలు చేపట్టాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తోంది.

**ఆదివాసీ పోరాటాలపై :**

మన సహజవనరులను సామ్రాజ్యవాదులకు, బడా పెట్టుబడిదారులకు దోచిపెట్టటానికి రూపొందించిన అభివృద్ధి నమూనాలో తమ జీవనోపాధిని, జీవితాలను కోల్పోతున్నవాళ్ళు, విస్థాపనకు గురికాబడుతున్నవారు ఆదివాసీలు. భూమిపై, నీటిపై, అడవిపై తమ హక్కులను నిలబెట్టుకోవటానికి, వనరుల విధ్వంసానికి వ్యతిరేకంగా ఆదివాసీలు సాగిస్తున్న పోరాటాలు న్యాయమైనవిగా ఈ మహాసభ నిర్ధారిస్తోంది. ఆ పోరాటాలకు తన సంపూర్ణ మద్దతును తెలియజేస్తోంది.

ఆదివాసీల సంక్షేమానికి ఉద్దేశించబడిన చట్టాలను శీఘ్రంగా, నిక్కచ్చిగా అమలుచేయాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తోంది.

ఆదివాసీల పోరాటాలకు సంపూర్ణ మద్దతు, సహకారాలను అందించవలసిందిగా ప్రజలకు ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

**మహిళలపై :**

మహిళలు నిరంతర బాధలకు గురికాబడుతున్న పరిస్థితి ఈ అఖిలభారత మహాసభ గమనంలోకి తీసుకుంటున్నది.

కులానికి వెలుపల వివాహాలు చేసుకున్న యువతీ యువకులు తీవ్రమైన దండనలకు గురికాబడుతున్నారు; చంపబడుతున్నారు కూడా. మహిళలు అనేకవిధాల వివక్షకు, పీడనకు గురవుతున్నారు. పని ప్రదేశాలలో, పొలాలలో తీవ్ర దోపిడికి గురవుతున్నారు. సమానపనికి సమానవేతనమన్నదే లేదు. మహిళా సాధికారిత పేరుతో సెజ్‌లలో బానిసలుగా తమ చెమటను చిందిస్తున్నారు. మైక్రో ఫైనాన్సు కంపెనీలు వారిని జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. లాభాల కోసం మార్కెట్లను పెంచుకోవటంలో భాగంగా అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికత పురుషాధిక్య సంస్కృతి విధించిన భారాలను తగ్గించటానికి బదులు, ఆడ శిశువులను గర్భంలోనే చిదిమివేయటానికి ఉపయోగించపడుతోంది. మహిళలపై అత్యాచారాలు ఎన్నో రెట్లు పెరగటంతోపాటు, వాటి క్రూరత్వం కూడా పెరుగుతోంది.

ఈ మహాసభ మహిళలపై సాగుతున్న అణచివేతను, భౌతికదాడులను తీవ్రంగా ఖండిస్తోంది. ఆర్థిక, రాజకీయ, సామాజికరంగాలలో మహిళల సమానత్వానికై పోరాడ వలసిందిగా ఈ మహాసభ ప్రజలకు పిలుపునిస్తోంది.

**ప్రజాస్వామిక హక్కులపై దాడులను ఖండిస్తూ :**

ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడులు తీవ్రమవటాన్ని ఈ మహాసభ గమనంలోకి తీసుకుంటున్నది. ప్రజల యొక్క ఏ చిన్న సమస్యనూ పరిష్కరించకపోగా, ఎన్‌డిఏ ప్రభుత్వం అణచివేత చట్టాలకు పదును పెట్టటానికి పూనుకొంటోంది. 'గుజరాత్ కంట్రోల్ ఆఫ్ టెర్రరిజం అండ్ ఆర్గనైజ్డ్ క్రైం యాక్ట్' వంటివాటిని నమూనాగా తీసుకొని వ్యవహరించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహిస్తోంది. కార్మిక చట్టాలను కాలరాయటానికి పూనుకుంటోంది. అడవులపై, భూమిపై, నీటిపై ఏ హక్కూ లేకుండా ఆదివాసులను అణగద్రొక్కేందుకు పూనుకుంది. ప్రజల ప్రతి హక్కునూ హరించివేసే విధంగా ఈశాన్య రాష్ట్రాలలోను, కాశ్మీర్‌లోనూ సాయుధ బలగాలకు ప్రత్యేక అధికారాలిచ్చి నిర్బంధాన్ని కొనసాగిస్తోంది. సామ్రాజ్యవాద తిమింగలాలు మన సహజవనరులను, ఆర్థికవనరులను మింగివేయటానికి మార్గాన్ని సుగమం చేయటమే ఈ నిర్బంధపు లక్ష్యం.

ప్రజలపైనా, ప్రజా పోరాటాలపైనా గత, ప్రస్తుత ప్రభుత్వాలు సాగించిన, సాగిస్తున్న క్రూర నిర్బంధాన్ని ఈ మహాసభ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రజలు తమ ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవటానికి సంఘటితం కావలసిందిగా ఈ మహాసభ వారికి పిలుపునిస్తున్నది.

**సిపాసరుబలి భూ పోరాటంపై :**

సామ్రాజ్యవాదులు నిర్దేశించిన అభివృద్ధి విధానాలు ప్రజల జీవితాలను, ఉపాధిని నాశనం చేయటం మాత్రమేకాదు; పర్యావరణాన్ని, సహజ వాతావరణాన్ని కూడా నాశనం చేస్తున్నాయి. ఈ అభివృద్ధి నమూనాలో భాగంగా కోస్తా తీరం మొత్తం పోర్టులు, పరిశ్రమలు, కోస్టల్ కారిడార్ వంటి పేర్లతో యథేచ్ఛగా దోపిడీ చేసుకోవటానికి బహుళజాతి సంస్థలకు, బడా వ్యాపార వర్గాలకు అప్పగించబడింది.

సహజంగా కోస్తా ప్రాంతంలో తుఫానుల తాకిడి ఉంటుంది. ప్రత్యేకించి ఒడిషాలో ఈ ప్రమాదం మరింత ఎక్కువ. వీటిని తట్టుకోవటానికి, తుఫాను తీవ్రతలను తగ్గించటానికి తీరం వెంబడి అడవులు, ఇసుక తిన్నెలు సహజసిద్ధమైన రక్షణ కవచాలుగా ఉపయోగపడతాయి. ఈ వాస్తవాన్ని తోసిపుచ్చుతూ ఒడిషా ప్రభుత్వం బడా కార్పొరేట్ వర్గాలతో చేతులు కలిపి పూరీ జిల్లాలో ఒక పెద్ద టూరిజం ప్రాజెక్టుకు ప్రణాళిక వేసింది. ఈ ప్రాజెక్టు కొరకు 3500 ఎకరాలకు పైగా భూమిని సమీకరించబోతున్నారు. ప్రజా వ్యతిరేక, పర్యావరణ వ్యతిరేక ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సిపాసరుబాలి ప్రాంత ప్రజలు 'ఉపకులియ జమి ఓ జంగిల్ సురక్షా సమితి', 'చాషీ మూలియా సంఘం'ల ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాలుగా తీవ్ర పోరాటం సాగిస్తున్నారు. అనేక సంవత్సరాలు భూమిని ఆక్రమించుకొని ఉన్న ఒకప్పటి భూ మాఫియా ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నది. వారు మరల భూములను ఆక్రమించుకోవటానికి ఏ దారినీ వదలక, భూమిపై ప్రజలకు గల హక్కును దూరం చేయ జూస్తున్నారు. ఈ పోరాటంలో ప్రజలు రాజ్యం నుండి, భూ మాఫియా నుండి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ అఖిల భారత మహాసభ పోరాడుతున్న సిపాసరుబలి ప్రజల తరఫున నిలబడుతూ, వారిపై దాడులను ఖండిస్తున్నది. వినాశకరమైన ఈ ప్రాజెక్టును విరమించుకుని, భూములను ప్రజలకు పంపిణీ చేయవలసిందిగా, ఒడిషా ప్రభుత్వాన్ని ఈ మహాసభ డిమాండ్ చేస్తోంది. అది మాత్రమే ప్రజల జీవనోపాధికి, కోస్తా ప్రాంత పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడగలదని ప్రకటిస్తోంది.

**విద్యారంగంపై :**

ప్రస్తుతం ఉనికిలోవున్న సామాజికవ్యవస్థ మన దేశంలోని అత్యంత విలువైన మానవ ఉత్పాదక సంపత్తిని నాశనం చేస్తోంది. బాలలకు మౌలిక విద్యను నిరాకరిస్తుంది. శ్రామికులలో మరోవిభాగం పాక్షికంగానో లేదా పూర్తిగానో పనిలేకుండా వున్న పరిస్థితులొక వైపు వుంటే మరోవైపున బాలలను తీవ్ర శ్రమదోపిడీకి గురిచేస్తోంది. తను మనుగడ సాగిస్తూ, ఉత్పత్తిని అభివృద్ధిచేసే వైపుగా శిక్షణను గరపవలసిన విద్య, ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు దేశంలోని ప్రజల అవసరాలకనుగుణంగాకాక, బహుళజాతి కంపెనీల దోపిడీకనుగుణంగా రూపొందించబడుతోంది.

1986 నూతన విద్యావిధానం నుండి, వరుసగా పాలన సాగిస్తూ వస్తోన్న ప్రభుత్వాలన్నీ ప్రపంచీకరణ ఎజెండాను స్వీకరించి అమలుచేస్తోన్న ఫలితంగా ప్రి-ప్రైమరీ నుండి ఉన్నత విద్య వరకు, విద్యారంగానికి ప్రజాధనం కేటాయింపును క్రమంగా ఉపసంహరిస్తూ వచ్చాయి. ఉపాధ్యాయ పోస్టులలో తగినన్ని ఖాళీలు, పెద్దస్థాయిలో ఉపాధ్యాయుల కాంట్రాక్టీకరణ, బోధనేతర సిబ్బంది ఉపసంహరణ, మౌలిక వసతులలో మరియు వివిధ సామాజిక దొంతరల వారిని మినహాయించే విధంగా బోధనాసంబంధిత విలువలను, స్థాయిలను నీరుగార్చటం జరుగుతూవస్తోంది. ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలను మూసివేయటానికి కారణమౌతున్న నయాఉదారవాద విధానాలతో లాభాల దాహంతో, కార్పొరేట్ల నియంత్రణలో, విద్యావ్యాపారాన్ని కె.జి. నుండి పి.జి. వరకు విస్తరించటం జరుగుతోంది. 'అందరికీ విద్య' ఎజెండాలో ప్రపంచబ్యాంకు ప్రాథమిక విద్యలోకి చొరబాటు వెనకనున్న లక్ష్యం క్లుప్తంగా ఇదే!

ఉన్నత విద్యారంగంలో, ప్రపంచ వాణిజ్యసంస్థ మార్కెట్ అవసరాలకనుగుణంగా ప్రభుత్వం ఈ రంగాన్నంతా తెరచి వుంచింది. 2015 డిసెంబర్‌లో నైరోబీలో నిర్వహించబడిన డబ్ల్యుటిఓ మంత్రులస్థాయి సభలో సంపన్న దేశాల కుటిల విధానాలతో ఉన్నత విద్యారంగంపై భారతదేశ "ప్రకటన" మరియు వారి ఈ "అంగీకారం" తిరగదోడ వీలులేనిదిగా పరిణమించింది. ఈ విధంగా భారతదేశంలోని బాలలు, పెద్దలు, యువత అంతా అసమానత్వాన్ని, వివక్షను పెంపొందించే బహుళదొంతరల విద్యావ్యవస్థకు బాధితులుగా వుండటం మినహా మరో మార్గం లేకుండాపోయింది.

బిజెపి ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యా విధానం - 2016 'నైపుణ్య భారత్ మిషన్' ద్వారా పాలకవర్గాల, వారి సామ్రాజ్యవాద ప్రభువుల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్ళేందుకు; కోట్లాది మంది మన యువత సొంతంచేసుకున్న నైపుణ్యాలను, విజ్ఞానాన్ని నీరుగార్చి, నాశనం గావించే కుటిల వ్యూహంతో 'మేక్ ఇన్ ఇండియా'కు జాతీయ విద్యా విధానాన్ని అనుసంధానించింది.

వ్యాపారీకరించబడిన ఈ 'నైపుణ్యాల'తో ధనిక, విలాసవంతమైన, రాజకీయంగా పలుకుబడిగలిగిన కార్పొరేటు విద్యాసంస్థలలో విద్య నభ్యసించిన మధ్యతరగతి, ఉన్నత తరగతి యువతను కట్టుబానిసల తరహాలో ప్రపంచ పెట్టుబడికి సేవచేసే విధంగా మలచుకుంటున్నది.

పేద సెక్షన్ల యువతను విద్య నుండి మినహాయించే ఈ కుటిల వ్యూహాన్ని మహాసభ తీవ్రంగా ఖండిస్తూ పాలకవర్గాల ఈ కుట్రను వెల్లడిచేస్తోంది. మనదేశం యొక్క ప్రజల యొక్క ప్రయోజనాలకనుగుణమైన సమాన విద్యావకాశాలకోసం పోరాడాలని మహాసభ పిలుపునిస్తోంది.

**ఆరోగ్యం, వైద్య సేవలపై :**

సంపన్న దేశాల ప్రజలకు అధునాతన వైద్య సేవలను, వైద్యపర్యాటకం పేరున ప్రభుత్వం నుండి తరచుగా సబ్సిడీలతో అందించబడుతుండగా, మౌలిక ఆరోగ్య సేవల కొరత కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాదిమంది గర్భిణులు, ప్రత్యేకించి, పసిపిల్లలు తేలిగ్గా నయం చేయగలిగిన జబ్బుల బారినపడి మరణిస్తున్నారు. పేదల ఆరోగ్య పరిరక్షణ పేరుతో ప్రవేశపెడ్తున్న ఆరోగ్య బీమా పథకాలతో వైద్యాన్ని, ఆరోగ్య సేవలను ప్రైవేటీకరిస్తున్నారు. ప్రజాధనం కార్పొరేటు ఆసుపత్రులకు మళ్ళించబడుతున్నది. ఆరోగ్య బీమాను బాగా ప్రోత్సహిస్తున్నారు.

విదేశీ బీమా దిగ్గజ కంపెనీలు - సంపదలను సమకూర్చే వ్యాపారమైన వైద్యబీమా రంగాన్ని ఆక్రమించటానికి ఒకరితో ఒకరు పోటీలు పడ్తున్నారు. పాలక సంపన్న శ్రేణులు విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించే పేరిట తమ ఔషధ ప్రయోగాలకు పేద ప్రజలను గినీపిగ్స్‌గా వాడే విదేశీ ఔషధ కంపెనీలను దేశంలోపలికి అనుమతిస్తున్నాయి. ఔషధ ప్రయోగాల బారినపడిన ప్రజల అనారోగ్యాలను పట్టించుకోకుండా వదిలివేస్తున్నాయి. ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత చేపట్టకుండా, బహుళజాతి కంపెనీలకు సూపర్ లాభాలను సమకూర్చేందుకు నీతిబాహ్య ఔషధ ప్రయోగాలకు ప్రభుత్వం తన పూర్తి మద్దతునిస్తోంది.

**నదీజలాల వివాదాలపై :**

మరోసారి కావేరీ నదీజలాలు వివాదకేంద్రంగా మారి ప్రజల ప్రాణాల, ఆస్తుల నష్టానికి కారణమైంది. కర్నాటక ప్రభుత్వం, తమిళనాడు రాష్ట్రానికి సాగునీరు విడుదలచేయటానికి నిరాకరిస్తోంది. తమిళనాడు రాష్ట్ర సాగు అవసరాలను, కర్ణాటక రాష్ట్ర త్రాగునీటి అవసరాలకు ఎదురు నిలుపుతున్నది. ప్రత్యేకించి బెంగుళూరు, సుప్రీంకోర్టు ఆదేశాన్ని అమలుచేయకుండా ధిక్కరించి ప్రాంతీయ దురహంకారాన్ని రేకెత్తించటంతో రెండు రాష్ట్రాల నడుమ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని సరిహద్దులను మూతవేయాల్సిన పరిస్థితి వచ్చింది. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వవైఖరిని, మరియు రెండు రాష్ట్రాలలోను ప్రజల మధ్య విద్వేషాలను పెంపొందించే అవకాశవాద శక్తుల చర్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. 2007లో సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా కావేరి నదీజలాల వివాద పరిష్కారానికి కావేరీ జలయాజమాన్య బోర్డును ఏర్పరచవలసిందిగా డిమాండ్ చేస్తున్నాం.

ప్రజల్ని విభజించేందుకు పాలకవర్గాలు మరియు వారి రాజకీయ పార్టీలు నదీజలాల పంపకాన్ని మరో సాధనం చేసుకుంటున్నారు. గోదావరి, కృష్ణ, కావేరీ నదులేగాక దక్షిణ భారతదేశంలోని పలు నదుల జలాల వినియోగాన్ని ఆ నదుల పరీవాహక ప్రాంత ప్రజలు ఒకరితో ఒకరు తలపడే అంశంగా మార్చారు.

రుతుపవన వర్షాలకు ఒక చంక్రమణ స్వభావం వుంటుందనేది, నమోదు కాబడిన వాస్తవం. 4 సంవత్సరాల చంక్రమణంలో రెండు సంవత్సరాలు సాధారణ వర్షపాతం, ఒక సంవత్సరం వర్షం కొరత, మరో సంవత్సరం విస్తృత వర్షాలు కురుస్తూ వస్తున్నాయి. రెండు వరుస సంవత్సరాలు కరువు సంభవిస్తే తాగు, సాగునీటి అవసరాలకు సంక్షోభం ఏర్పడుతుంది.

రిజర్వాయర్లలో నిల్వ వుంచిన నీటిని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సాగు, తాగునీటి అవసరాల ప్రాధాన్యతలను ప్రక్కనబెట్టి, పూర్తిసామర్ధ్యంమేరకు జల విద్యుదుత్పాదన చేయటంద్వారా రిజర్వాయర్లను ఖాళీ చేస్తున్నాయి. అనేక ట్రిబ్యునల్స్‌ను ఏర్పరచారు. అవి ఆయా నదుల పరీవాహక రాష్ట్రాల నడుమ ఆ నదీ జలాల పంపకంపై తీర్పులు, ఆదేశాలు ఇచ్చివున్నాయి. కావేరీ జలవివాదంలో కూడా సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఆదేశం జారీచేసింది. అయినప్పటికీ పాలకవర్గ పార్టీలు ఇరు రాష్ట్రాల ప్రజలలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టాయి.

అధికారమార్పిడి జరిగిన 7 దశాబ్దాల తర్వాత కూడా, విశాల ప్రాంతంలో భూములన్నీ కరువు పీడిత ప్రాంతాలుగా వుంచబడుతూ, బడా పారిశ్రామిక యాజమాన్యాలకు కారుచౌక శ్రమశక్తి సరఫరా కేంద్రాలుగా మలచబడుతున్నాయి. ఉనికిలోవున్న సాగునీటి వ్యవస్థల ఉద్దేశపూరిత నిర్లక్ష్యం మరియు ప్రాధాన్యతలను తుడిచిపెట్టే అపసవ్య యాజమాన్య పద్ధతులు కలగలిసి సాధారణ రుతుపవనాల సంవత్సరాలలోనూ నీటి సరఫరా కొరతకు కారణ మౌతున్నాయి. పైగా, డబ్ల్యుటిఓ ఒప్పందం అమలులోకి వచ్చాక, తదనుగుణంగా నీటిని ఓ వర్తకపు సరుకుగా ప్రకటించాక, కేంద్ర-మరియు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎవరైతే నీటికి డబ్బు చెల్లించగలుగుతున్నారో వారికే నీటిని వ్యాపార సరళిలో సరఫరా చేస్తున్నాయి. ఈ క్రూరమైన తమ లక్ష్యాన్ని సాధించటానికి పాలకవర్గాలు మరియు వారి రాజకీయ ప్రతినిధులు నదీజలాల వివాదాల పరిష్కారంపై దృష్టి సారించటంలేదు.

గ్రామీణ భారతంలో ప్రధాన ఉపాధి వనరుగా వున్న వ్యవసాయంలో, ఎండిన తమ భూములలో లాభదాయకమైన వ్యవసాయం చేయాలంటే నీరు అత్యావశ్యకంగా వుంది. అన్ని రాష్ట్రాలలో ప్రజల న్యాయమైన, ప్రజాస్వామిక ఆకాంక్ష ఇది. ప్రజల ఈ డిమాండ్‌ను నెరవేర్చటానికి బదులుగా, వరుసగా పాలిస్తున్న ప్రభుత్వాలన్నీ నదీ పరీవాహక ప్రాంత రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ఎదురుబొదురుగా నిలిపి ప్రాంతీయ విద్వేషాలను రేపి, వాస్తవ కారణాన్నుండి ప్రజల దృష్టిని మళ్ళిస్తున్నాయి.

ఇదేమీ పరిష్కరించపలేనంత జటిలమైన సమస్యేమీ కాదు. ఆంధ్రప్రదేశ్ - కర్ణాటక రాష్ట్రాల మధ్యనున్న తుంగభద్ర డ్యామ్ యాజమాన్య బోర్డు అప్పుడప్పుడు చిన్నపాటి సమస్యలు మినహా, ఇబ్బందులేమీ లేకుండా సాగిపోతూ, గతంలో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించిన విధంగా రెండు రాష్ట్రాలలోని ఆయకట్టుకి సాగునీటిని పంపిణీ చేసుకుంటున్నాయి.

సాగు, తాగునీరు, వరద నిర్వహణ చివరగా విద్యుదుత్పాదనల ప్రాధాన్యతా క్రమంలో ప్రతి నది యొక్క సమగ్ర నీటి వినియోగ పథకాన్ని రూపొందించాల్సిన సమయం ఇది. ప్రాధాన్యతా క్రమంలో అందుబాటులోవున్న నీటి ప్రాతిపదికపై నీటి పంపిణీని తప్పనిసరిచేసే స్పష్టమైన ఆదేశాలలో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావు లేకుండా నదీ జలాల యాజమాన్య బోర్డులు ఏర్పరచాలి. పదేపదే పునరావృత మవుతున్న కరవు, వరదల సమస్యను అప్పుడు మాత్రమే అదుపులోకి తేవటం ద్వారా ప్రజా ప్రయోజనాలు కాపాడబడతాయి. అయితే ప్రజావ్యతిరేక శక్తులుగా తమకు తాము పలుమార్లు రుజువుచేసుకున్న దోపిడీ పాలకవర్గాలు ఈ విధమైన పథకాన్ని అమలుచేయవు.

పాలకవర్గ పార్టీల విభజించి పాలించే కుటిల విధానాలకు ప్రజలు సమిధలు కారాదని, ప్రాంతీయ భావనలను అధిగమించి ఐక్యంగా నిలవాలని మహాసభ పిలుపునిస్తోంది.

ప్రతి నదీ ప్రాజెక్టు పరిధిలోనూ సమగ్ర నీటి వినియోగ పథకంకోసం చిన్న, మధ్యతరహా, భారీ నీటి పారుదలవ్యవస్థలను సమతూకంగా ఉపయోగించటం ద్వారా ప్రతి ఎకరా భూమికి నీరందించే శాస్త్రీయవైఖరిని రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధంకమ్మని మహాసభ పిలుపునిస్తోంది.

**రోహతాస్‌లో ప్రజాందోళనపై నిర్బంధాన్ని ఖండిస్తూ :**

బీహార్ రాష్ట్రంలోని-సిపిఐ(ఎం-ఎల్) రోహతాస్ రాష్ట్రకమిటి-స్థానిక రాష్ట్రపాలనా యంత్రాంగంయొక్క దన్నుతో క్వారీ మాఫియా సాగిస్తున్న చట్టవిరుద్ధ తవ్వకాలను వ్యతిరేకిస్తూ ఆందోళన సాగిస్తున్నది. ఆందోళన క్రమంలో అనేకమంది ప్రజలు తప్పుడు కేసుల్లో ఇరికించబడ్డారు. జైళ్ళలో నిర్బంధించబడ్డారు. అనేకమంది ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులతోపాటుగా బీహార్ రాష్ట్రకమిటి సభ్యుడు కామ్రేడ్ అశోక్‌భైతాతోసహా అనేకమంది సిపిఐ(ఎం-ఎల్) సభ్యులు తప్పుడు కేసులలో ఇరికించబడ్డారు. ఈ విధంగా క్వారీమాఫియా నిర్విఘ్నంగా తవ్వకాలు సాగించుకునేందుకు అడ్డంకులు లేకుండా చేశారు

ప్రజలపై, సిపిఐ(ఎం-ఎల్) శ్రేణులపై ప్రయోగించ బడుతున్న నిర్బంధాన్ని ఈ మహాసభ తీవ్రంగా ఖండిస్తోంది. అశోక్‌భైతాతో సహా తప్పుడు ఆరోపణలపై నిర్బంధింపబడిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని, వారందరిపై మోపబడిన తప్పుడు కేసు లన్నింటినీ రద్దుచేయాలని, మహాసభ డిమాండ్ చేస్తోంది. రోహతాస్ జిల్లాలో చట్టవిరుద్ధ అక్రమ క్వారీ తవ్వకాలను తక్షణం ఆపివేయాలని మహాసభ డిమాండ్ చేస్తోంది.

**వ్యవసాయ సంక్షోభంపై :**

రైతు ఆర్థికవ్యవస్థ సంక్షోభానికి కారణమైన విధానాలు అమలవుతూ, రైతాంగ సంక్షోభం కొనసాగుతోంది. యుపిఏ ప్రభుత్వం వదిలిన దగ్గర ప్రారంభించి, సంస్కరణల క్రమంగా పిలవబడే విధానాలనే మోడీ ప్రభుత్వం కొనసాగిస్తోంది.

గ్రామీణ భారతదేశం ఈ కాలంలో ఘోరమైన దుర్భర పరిస్థితులనెదుర్కొంటోంది. రైతాంగంలో పేదరికం పెరిగిపోతూ వారు క్రమంగా మధ్యతరగతి నుండి పేదరైతాంగంగా, పేదరైతాంగం భూమిహీనులైన నిరుపేదలుగా దిగజారిపోతున్నారు. ఈ కాలంలో భూమిహీనత, కౌలురైతులుగా భూమిని సేద్యం చేయటం, వ్యవసాయ కార్మికుల సంఖ్య కొట్టవచ్చినట్లు పెరుగుతూ వస్తోంది. భారత బడాపెట్టుబడిదారులకు, విదేశీ బడాకార్పొరేట్లకు కట్టబెట్టేందుకోసం రైతాంగం నుండి భూములను ప్రభుత్వం గుంజుకునే ప్రక్రియ జోరందుకోని భూమిహీనులైన గ్రామీణ కుటుంబాల సంఖ్య గ్రామీణ భారతదేశంలో పెరుగుతోంది.

భూయజమానులు తమ భూములను 'భూబ్యాంకు'లో నిల్వచేసుకొంటే, శక్తివంతులైన వ్యవసాయదారులు అనగా కార్పొరేటు సంస్థలు ఈ బ్యాంకుల నుండి భూములను లీజుకు తీసుకొని కార్పొరేటు వ్యవసాయం సాగించటాన్ని 'వైబ్రెంట్ ల్యాండ్ మార్కెట్' పేరున బిజెపి ప్రభుత్వం విధానాలను రూపొందించి అమలుకు పూనుకుంది. ప్రస్తుతమున్న చట్టాలు కౌలుదారుల హక్కులను పరిరక్షించటంలేదనే పేరున కౌలుదారులకున్న కనీసపాటి హక్కులను కూడా ఎత్తివేసేందుకు బిజెపి ప్రభుత్వం పూనుకుంది. తదనుగుణంగా ఓ నమూనా కౌలుదారుల చట్టాన్ని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలచేత ఆమోదింపజేయించటం కోసం సిద్ధం చేసింది. కాంట్రాక్టు లేదా కార్పొరేటు వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు పాలక వర్గాలు అమలుచేయదలుచుకున్న అనేక వరుస పథకాల్లో ఇదొక పథకం.

రైతుల ఆత్మహత్యలకు మూలమైన అసలు కారణాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టకుండా కౌలురైతులను, వ్యవసాయ కూలీలను మినహాయించటం ద్వారా ప్రభుత్వం రైతాంగ ఆత్మహత్యల సంఖ్యను తక్కువజేసి చూపే ప్రయత్నం చేస్తోంది.

ఈవిధంగా ఈ కాలంలో తీసుకున్న, చేపట్టిన ప్రతి విధానమూ, చర్యా రైతాంగ దుర్భర పరిస్థితిని మరింత పెంచటానికే దోహదపడేదిగానూ, వాస్తవానికి రైతులను తమ భూముల నుండి వెడలగొట్టి ఆ భూములను కార్పొరేట్ల, కంపెనీలపరం చేసేందుకు ఉద్దేశించిందిగానూ వుంది.

బడాభూస్వాములు, బడా పెట్టుబడిదారులు, మరియు సామ్రాజ్యవాదుల కూటమి – మిగులు శ్రమను కొల్లగొడుతూ, ఫ్యూడల్ మరియు పెట్టుబడిదారీ మార్కెట్ తరహా దోపిడీని ఉపయోగించుకుంటూ రైతాంగాన్ని దుర్భర దారిద్ర్యంలోకి పడదోస్తూ, ఆత్మహత్యల పాల్జేస్తున్నారు.

దున్నేవానికే భూమి ప్రాతిపదికన భూమి పునః పంపిణీ వంటి సమూల చర్యలను పరిస్థితి డిమాండ్ చేస్తోంది. తద్వారా మాత్రమే వ్యవసాయ సంక్షోభం పరిష్కారమవుతుంది.

రైతాంగం, ప్రజానీకం సంఘటితమై 'దున్నేవానికే భూమి' కేంద్ర నినాదంగా విప్లవ భూసంస్కరణల అమలుకోసం సంఘటితంగా పోరు సాగించాలని మహాసభ పిలుపునిస్తోంది.

**కార్మికవర్గంపై దాడులను ఖండిస్తూ**

మనదేశంలో కార్మికవర్గం ఎలాంటి భద్రతాలేని దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. అవమానకరమైన, ప్రమాదకరమైన, దుర్భరమైన పని, జీవన పరిస్థితులలో వారు నెట్టబడి వున్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం వారిని బానిసలుగా కట్టిపడవేసేవిధంగా ఇప్పటికివున్న కనీసపాటి చట్టబద్ధ రక్షణలన్నింటినీ ఎత్తివేసేందుకు ఒక పద్ధతిగా కార్మికవర్గంపై దాడులను సాగిస్తూంది. కార్మిక సంస్కరణలపేరున కనీస వేతన చట్టాన్ని, బోనస్ చట్టాన్ని, సమానవేతన చట్టం, పారిశ్రామిక సంబంధాల చట్టం మొదలైన వాటన్నింటినీ సవరించేందుకు పూనుకుంది. అసంఘటితరంగంలో కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామనే ప్రభుత్వ ప్రకటనలన్నీ బూటకమైనవే!

సాంప్రదాయ కార్మికోద్యమం–కార్మికులను తమ హక్కుల సాధనకై పోరాడే స్ఫూర్తిని రగిలించే విధంగా లేదనేది ఓ చేదు వాస్తవం.

పార్టీ అఖిలభారత మహాసభ కార్మికులపై, కార్మికవర్గంపై దాడులను తీవ్రంగా ఖండిస్తూ, ప్రభుత్వ ఈ తిరోగమన చర్యలను ప్రతిఘటించాల్సిందిగా కార్మికులకు పిలుపునిస్తోంది.

తమ వర్గపు పునాదిపై కార్మికులంతా సంఘటితమై ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని ప్రస్తుత పరిస్థితి డిమాండ్ చేస్తోంది.

ooooo